క్లుప్తంగా

పెద్దారవీడు ఏఓగా జాఫర్ అలీబేగ్



జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ నుంచి పదోన్నతి పత్రాన్ని అందుకుంటున్న జాఫర్

మార్కాపురం టౌన్: పెద్దారవీడు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మీర్జా జాఫర్ అలీబేగ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా(ఏఓ)గా పదోన్నతి లభించింది. శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ద్వారా పదోన్నతి పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఏ1 గ్లోబల్ కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, ఫౌండర్ ఉస్మాన్ బేగ్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా జాఫర్ అలీబేగ్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

మార్కాపురం టౌన్: సహజీవనం చేస్తున్న మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. కంభం రోడ్డులోని సినిమా హాల్ వద్ద ఒక ఇంటిలో సహజీవనం చేస్తున్న వరలక్ష్మి, ఈశ్వరయ్య మధ్య ఇటీవల కాలంలో విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం వరలక్ష్మిపై ఈశ్వరయ్య దాడి చేయడంతో గాయాలపాలై మార్కాపురం జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు



108 వాహనంలో క్షతగాత్రుడు

కొమరోలు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని నల్లగుంట్ల గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వినుకొండకు చెందిన రాజేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తూ నల్లగుంట్ల సమీపంలో అదుపు తప్పి కిందపడిపోయాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పత్తి దిగుమతి సుంకం తగ్గింపు జీవో రద్దు చేయాలి

బేస్తవారిపేట: కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై 11 శాతం సుంకాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తూ ఇచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని మోక్షగుండంలో రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. మరో మూడు నెలల్లో పత్తి దిగుబడులు ప్రారంభమయ్యే దశలో దిగుమతి సుంకం రద్దు చేయడంతో అమెరికన్ కంపెనీలు, దేశంలోని కంపెనీలే బాగుపడతాయని, రైతులకు ఆత్మహత్యలే శరణ్యమవుతాయన్నారు. ఇప్పటికే పత్తి రైతులు తక్కువ ధరకు అమ్ముకుని నష్టాల్లో ఉన్నారని, ఇకపై పూర్తిగా కోలుకోలేని స్థితిలోకి వెళ్తారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి డాకాల పుల్లయ్య, సీపీఐ నాయకులు జోసఫ్, ఆర్.యోగయ్య పాల్గొన్నారు.

చెట్టు కొమ్మలు తొలగింపు

గిద్దలూరు రూరల్: స్థానిక మాయాబజార్ వీధిలో పశువైద్యశాల ఆవరణలో విరిగిపడిన భారీ చెట్టు కొమ్మలను మున్సిపల్ కమిషనర్ రమణబాబు ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం తొలగించారు. ఈ సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా ఆ శాఖ సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

సేద్యం మందగమనం



- పశ్చిమ ప్రకాశంలో చురుగ్గా సాగని వ్యవసాయం
- సాగు లక్ష్యం 75,510 హెక్టార్లు.. సాగైంది 17,770 హెక్టార్లు
- ఖరీఫ్ ముగుస్తున్నా ఇప్పటి వరకు సాగైంది 24 శాతం మాత్రమే
- మిరపకు నష్టాలు రావడంతో మొక్కజొన్న, పత్తి సాగుపై దృష్టి

మార్కాపురం:

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా పశ్చిమ ప్రకాశంలో పంటల సాగు అంతంతమాత్రంగానే ఉంది. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, అడపాదడపా కురిసిన వర్షాలతో పెద్దగా ప్రయోజనం ఉండకపోవడంతో ఖరీఫ్ సాగు మందగించింది. దీంతో రైతులు ఈ ఏడాది పంటల సాగుపై ఆందోళన చెందుతున్నారు. ఆగస్టు నెల ముగుస్తున్నప్పటికీ మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల పరిధిలో 24 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. దీంతో ఈ ప్రభావం వచ్చే రబీ సీజన్‌పై పడనుంది. ఆహార ధాన్యాలు, గ్రాసం కొరత ముందు ముందు తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పశ్చిమ ప్రకాశంలో మొత్తం ఖరీఫ్ సీజన్‌లో 75,510 హెక్టార్లలో వివిధ పంటలు సాగు కావాల్సి ఉండగా ఈ నెల 25వ తేదీ నాటికి కేవలం 17,770 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి.



మార్కాపురం ప్రాంతంలో సాగులో ఉన్న పత్తి

పత్తి, మొక్కజొన్నపైనే ఆశలు

మిరప సాగుతో గత ఏడాది నష్టాలు మూటగట్టుకుని కుదేలైన రైతులు ఈ ఏడాది పత్తి, మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. అత్యధికంగా మొక్కజొన్న 1,882 హెక్టార్లకుగాను లక్ష్యాన్ని మించి 2,267 హెక్టార్లలో సాగు చేశారు. పత్తి 20,748 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 7,328 హెక్టార్లలో వేశారు.

పంట	సాగు కావాల్సింది (హెక్టార్లలో)	సాగైంది (హెక్టార్లలో)
వరి	5339	563
జొన్న	108	11
సజ్జ	1435	798
మొక్కజొన్న	1882	2267
రాగి	16	0
చిరుధాన్యాలు	1105	271
కంది	13,848	1934
పెసర	350	55
మినుములు	1069	183
ఉలవలు	2	0
కా గ్రామ్	10	9
వేరుశనగ	18	2
నువ్వులు	1755	796
పొద్దుతిరుగుడు	8	0
ఆముదం	1230	924
సోయాబీన్	14	0
ఆయిల్ పామ్	8	0
ఇతర ఆయిల్ సీడ్	1	0
మిర్చి	18,440	364
ఉల్లి	150	75
పసుపు	264	118
చెరకు	2	0
పత్తి	20,748	7,328
కూరగాయలు	1941	640
జనుము	44	0
పొగాకు	1201	37
గడ్డి	283	7
ఇతర పంటలు	4,245	1,388
మొత్తం	75,516	17,770

2 ఎకరాల్లో కంది సాగుచేశా



మాది పెద్దారవీడు మండలం బద్వీడు చెర్లోపల్లి గ్రామం. ఈ ఏడాది సమయానికి ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో పత్తి, మిర్చి సాగు చేయాలంటే భయమేసి చాలించుకున్నాం. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి వస్తుందన్న ఆశతో 2 ఎకరాల్లో కంది సాగు చేశా. తెగుళ్లు సోకకుండా ఉంటే మంచి దిగుబడులు వస్తాయనుకుంటున్నాం.

–కంచర్ల వెంకట చెన్నశంకర్, రైతు

పత్తి పైరు ప్రస్తుతానికి ఫర్వాలేదు



మాది పెద్దారవీడు మండలం పుచ్చకాలయపల్లి గ్రామం. ఈ ఏడాది సుమారు 2 ఎకరాల్లో పత్తిని సాగు చేశా. ఇప్పటికైతే పత్తి పైరు బాగానే ఉంది. తెగుళ్లు వస్తే మాత్రం పూర్తిగా నష్టపోతాం. ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలకు పైరు ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. దిగుబడులు ఎలా ఉంటాయో చూడాలి మరి.

– కె పోలిరెడ్డి, రైతు

కంది, మొక్కజొన్న సాగు చేసుకోవచ్చు



రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో కంది, మొక్కజొన్న పంట సాగుచేసుకోవచ్చు. సబ్ డివిజన్‌లో 45 శాతానికి పైగా రైతులు పత్తి సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలు పంటల సాగుకు ఉపయోగపడతాయి. రైతులు రోజూ పంటను గమనించాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే రైతు సేవా కేంద్రానికి వెళ్లి సలహాలు, సూచనలు తెలుసుకోవాలి. ఇష్టం వచ్చినట్టుగా ఎరువులు వేయవద్దు.

– బాలాజీ నాయక్, ఏడీఏ మార్కాపురం

కూటమి పాలనపై తీవ్ర ప్రజా వ్యతిరేకత

- ఏడాదిన్నరలోనే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు
- జగనన్న హయాంలోనే ప్రజా సంక్షేమ పాలన
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

కంభం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనపై ఏడాదిన్నర వ్యవధిలోనే తీవ్ర స్థాయిలో ప్రజా వ్యతిరేకత పెల్లుబుకుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జెండా పట్టుకున్న కార్యకర్తలను ఎవ్వరూ విడదీయలేరన్నారు. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కంభం మండలంలోని జంగంగుంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఆమె కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లపాటు ప్రజా సంక్షేమ పాలన చూశామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అస్పష్ట విధానాలతో అడ్డగోలుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర చరిత్రలో ఏడాదిన్నర వ్యవధిలోనే ఇంతలా వ్యతిరేకత మూటగట్టుకున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవా చేశారు. పేరుకు మాత్రం ముగ్గురు కలిసినా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఎన్నో మాటలు చెప్పి, ఎన్నో ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఇప్పుడేమో తమవల్ల కావట్లేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిలా సంక్షేమ పాలన అందించడం మాటలు చెప్పినంత సులువు కాదన్నారు. కరోనా కష్ట సమయంలో కూడా సంక్షేమ పథకాలు సజావుగా అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. సినిమాల్లో డైలాగులు చెప్పే ఓ పెద్దాయన మైకులు పట్టుకొని వేదికలపై తెగ ఊగిపోయాడని, జగనన్నను ఏక వచనంతో సంబోధించిన ఆయనకు రాబోయే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులతోపాటు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జంగంగుంట్ల గ్రామ ప్రజలు వైఎస్సార్ సీపీపై చూపిస్తున్న ప్రేమ వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీ నెమలిదిన్నె చెన్నారెడ్డి, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



సూర స్వామిరంగారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రాచర్ల: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ సూర స్వామిరంగారెడ్డి పేర్కొన్నారు. రాచర్ల మండలం పాలకవీడు పంచాయతీ పరిధిలోని ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన సూర స్వామిరంగారెడ్డి రైతు విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ పదవి స్వీకరించిన సందర్భంగా సత్యవోలు మాజీ సర్పంచ్ పాలుగుళ్ల రంగస్వామిరెడ్డి, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు పల్నాటి మహబూబ్‌పీరా, నాయకులు బత్తుల శివ రాజ్‌యాదవ్, రంగస్వామిరెడ్డి, కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూర స్వామి రంగారెడ్డి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మాతృ భాషను ఆదరించాలి

- మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి



మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి



గొట్లగట్టు కేజీబీవీలో..

మార్కాపురం: మాతృ భాషను ఎవరూ మర్చిపోకూడదని రెడ్డి మహిళా కళాశాల ప్రెసిడెంట్ జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రెడ్డి జూనియర్ డిగ్రీ మహిళా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మాతృభాష తల్లిలాంటిదని, దేశ భాషలందు తెలుగు లెస్స అన్నారు. ఈ సందర్భముగా తెలుగు ఉపాధ్యాయురాలు రావి గాయత్రిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భారతమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాన్ని హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పొదిలి: తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామమూర్తి చేసిన సేవలు మరువలేనివని ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు బాషా ఖ్యాతిని ప్రపంచం నలుదిశలా చాటిన ఘనత రామమూర్తికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జి.రామకోటయ్య, కంప్యూటర్ అధ్యాపకులు వి.కృష్ణంరాజు, అధ్యాపకులు జి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, గొట్లగట్టు, మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, హెచ్‌ఎం ఆదినారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధికార భాషను ప్రజల భాషగా మార్చడానికి గిడుగు చేసిన కృషిని, తెలుగు భాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవం నిర్వహించి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేఖ, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఆదినారాయణ పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పొదిలిలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కోపంతో విచక్షణ జ్ఞానం కోల్పోవద్దు



మాట్లాడుతున్న న్యాయమూర్తి అబ్దుల్ షరీఫ్

మార్కాపురం/గిద్దలూరు రూరల్: కోపంలో విచక్షణా జ్ఞానం కోల్పోయి నేరాలకు పాల్పడి జైలు జీవితం గడపవద్దని జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ ఎస్‌కే అబ్దుల్ షరీఫ్ ఖైదీలకు సూచించారు. శుక్రవారం మార్కాపురం, గిద్దలూరు సబ్‌జైలును ఆయన తనిఖీ చేసి ముద్దాయిలు, రిమాండ్ ఖైదీలతో మాట్లాడిన అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎస్‌కే అబ్దుల్ షరీఫ్ మాట్లాడుతూ దేవుడిచ్చిన మానవ జన్మను మంచి చెడును గ్రహించే విచక్షణ జ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. కుటుంబ సభ్యుల మధ్య సత్సంబంధాలు ఉండాలని తెలిపారు. మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నమైనప్పుడు సమాజంలో శాంతి ఉండదన్నారు. మనుషులు ఆవేశంతో, కోపంతో విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారన్నారు. చట్టాలను అతిక్రమిస్తే జైలుశిక్ష తప్పదని అన్నారు. చెడు అలవాట్లను వీడి మంచి కుటుంబ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జైలు సూపరింటెండెంట్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

- సబ్ కలెక్టర్ త్రివినాగ్ హెచ్చరిక



రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం టౌన్: ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆయన పట్టణంలోని ఎరువుల దుకాణాలు, గోడౌన్‌లను ఏడీఏ బాలాజీ నాయక్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల బస్తాల తూకాన్ని పరిశీలించడంతోపాటు స్టాక్ రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఓ బుజ్జిబాయి ఉన్నారు.

కంభం: ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వి.కిరణ్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి మహమ్మద్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. రైతులకు ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని డీలర్లకు స్పష్టం చేశారు.

లంబోదరా.. వెళ్లిరా..



జంగంగుంట్లలో రూ.1.80 లక్షలకు దక్కించుకున్న లడ్డూతో భక్తులు



కొమరోలు : మూలపల్లెలో లడ్డూను వేలంలో దక్కించుకున్న భక్తుడు



గిద్దలూరులో వేలంలో లడ్డూ దక్కించుకున్న ముస్లిం యువకుడు సయ్యద్ మునాఫ్



బేస్తవారిపేటలో వైఎస్సార్ సీపీ జెండాలతో హోరెత్తిస్తున్న పూసలపాడు మహిళలు



కొనకనమిట్ల హరిజనకాలనీలో చిందేస్తున్న యువతులు



గొట్లగట్టులో గణేష్ మండపం వద్ద భక్తుల భజన



కంభం చెరువులో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: వినాయక చతుర్థి సందర్భంగా మండపాల్లో పూజలందుకున్న లంబోదరుడి విగ్రహాలను మూడో రోజు శుక్రవారం కోలాహలం మధ్య నిమజ్జనానికి తరలించారు. గణనాథుడి ఊరేగింపులో చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ప్రతిఒక్కరూ పాల్గొని సందడి చేశారు.

- మండల కేంద్రమైన బేస్తవారిపేటతోపాటు గ్రామాల్లో విగ్రహాలను చీతిరాల కతువ, కంభం చెరువులో నిమజ్జనం చేశారు. బేస్తవారిపేట జంక్షన్‌లో గణపతి విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను చక్కా శివాజీ వేలంలో రూ.50 వేలకు దక్కించుకున్నారు. పూసలపాడు గ్రామ మహిళలు, యువకులు వైఎస్సార్‌సీపీ జెండాలు, వైఎస్ జగన్ కటౌట్లతో చిందేస్తే హోరెత్తించారు. మహిళలు దారిపొడవునా మాజీ సీఎం వైఎస్ జగన్ ఫొటోలకు హారతిస్తూ, క్షీరాభిషేకం చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.
- కంభం మండలంలోని జంగంగుంట్లలో గణేశ్ లడ్డూను వేలం వేయగా మనుమాసు వీరారెడ్డి రూ.1.80 లక్షలకు సొంతం చేసుకున్నారు. అనంతరం కోలాహలంగా గ్రామోత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన విగ్రహాలతో కంభం చెరువు సందడిగా మారింది.
- గిద్దలూరులోని కొంగలవీడు రోడ్డు, పూసల బజార్‌లో గణేశ్ లడ్డూను సారే రాముడు రూ.1.20 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. గాంధీబొమ్మ సెంటర్, పుల్లయ్య కాంప్లెక్స్ వీధుల్లో గణేశ్ లడ్డూను ముస్లిం యువకుడు సయ్యద్ మునాఫ్ రూ.3,361కు కైవసం చేసుకున్నాడు.
- రాచర్ల మండలంలోని ఓబుల్‌రెడ్డిపల్లెలో గణేశ్ లడ్డూను ఎనుముల నారాయణరెడ్డి రూ.30 వేలకు దక్కించుకున్నారు.
- కొమరోలు మండలంలో శుక్రవారం 56 వినాయక విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేశారు. మూలపల్లెలో గణేశ్ లడ్డూను రూ.1,10,116కు డి.దక్షిత్‌రెడ్డి, తాతిరెడ్డిపల్లె ఎస్సీ పాలెంలో లడ్డూను బందారు శిరీష 42 వేలకు, యర్రగుంట్ల ఎస్సీపాలెంలో లడ్డూను కోమలపాటి వెంకటయ్య రూ.32 వేలకు దక్కించుకున్నారు.
- మండల కేంద్రమైన కొనకనమిట్లతోపాటు గొట్లగట్టు, చినారికట్ల తదితర గ్రామాల్లో గణేశ్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. గొట్లగట్టులో భక్తులు విశేష పూజలు నిర్వహించి, అన్న సంతర్పణ చేశారు. ఎస్సై ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

లక్ష గరిక దళాలతో పూజలు



గరిక దళాలతో పూజలందుకుంటున్న గణనాథుడు

మార్కాపురం మండలంలోని దరిమడుగులో గణనాథుడి విగ్రహానికి భక్తులు లక్ష గరిక దళాలతో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్‌కే మానిక తెలిపారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను 99592 25702కు తెలియజేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఆర్టీసీ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.